క్లుప్తంగా

భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

రామడుగు: కరీంనగర్– జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పలువురు కోల్పోతున్న భూములను బుధవారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పరిశీలించారు. మండలంలోని దేశరాజ్‌పల్లి, వెదిర గ్రామ పరిధిలో భూములు, ఇళ్లపై వారం రోజుల్లో సర్వే చేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర: గంగాధర–పెగడపల్లి ప్రధాన రహదారి మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులోని పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఎన్నికలకు బ్రిడ్జి నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచాక మరిచిపోయారన్నారు. ఏటా వర్షాకాలంలో వరద ఉధృతితో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పాత బ్రిడ్జికి ఇరువైపులా ఎటువంటి రక్షణ గోడలు లేవని, బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టక పోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, పంజాల ప్రశాంత్, దూళం కళ్యాణ్, మల్యాల వినయ్‌సాగర్, ఇనుకొండ నర్సింహరెడ్డి, గాలిపల్లి శ్రీనివాస్, రేండ్ల శ్రీనివాస్, దాసరి ఆంజనేయులు, సత్యనారాయణ, వినోద్ పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 407లో ఎకరం 31 గుంటల సీలింగ్ ల్యాండ్‌పై సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని బుధవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రాజేశ్వరీకి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. హద్దులు ఏర్పాటుతో పాటు ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోల రమేష్, మాజీ ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, నాయకులు అమిరిశెట్టి సుధాకర్, దామోదర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

విచారణ జరుపుతాం

సీలింగ్ ల్యాండ్ రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ రాజేశ్వరీ తెలిపారు. సాక్షిలో బుధవారం ప్రచురితమైన 'యథేచ్ఛగా భూకబ్జా' కథనానికి స్పందించారు. భూమి విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామన్నారు.

ఎంపీ నిధులతో బోర్‌వెల్

మానకొండూర్: కరీంనగర్ నగరపాలక సంస్థ ఏడో డివిజన్ సదాశివపల్లి, మానకొండూర్ మండల పరిధిలోని శివాలయంలో బీజేపీ నాయకులు బుధవారం ఎంపీ నిధులతో బోర్‌వెల్ వేయించారు. శివాలయంలో నీటి సమస్య ఉందని కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు నాయకులు విన్నవించారు. భక్తుల కోసం నీటి సౌకర్యం కల్పించామని నాయకులు తోట సాగర్, నర్సింహారెడ్డి, రాజశేఖర్, సంపత్, సంజీవ్, సంతోష్ తెలిపారు. ఈసందర్భంగా డివిజన్ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి వీరస్వామి (40) మద్యానికి బానిసై బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య వనమాల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీరాస్వామికి భార్య, కూతురు, కుమారుడు.

బీమా చెక్కు అందజేత

గంగాధర: మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన ఒగ్గరి ప్రశాంత్ ఇటీవల వ్యవసాయబావి వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడికి గంగాధర ఎస్బీఐ శాఖలో సేవింగ్ ఖాతతో పాటు ప్రమాద బీమా సౌకర్యం ఉంది. రూ.20 లక్షల ప్రమాద బీమా మంజూరుకాగా మృతుడి కుటుంబానికి బుధవారం రీజినల్ మేనేజర్ వెంకటేశ్ చెక్కు అందజేశారు. ప్రతి ఖాతాదారుడు జనరల్ ఇన్సూరెన్స్ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ వంశీధర్, ఏరియా మేనేజర్ కిరణ్‌రెడ్డి, బీడీఎం రాజు, మాజీ సర్పంచ్ నవీన్‌రావు తదితరులున్నారు.

కరుణించని వరుణుడు

- వాడిపోతున్న పత్తి మొలకలు
- ఆందోళనలో అన్నదాత
- పది రోజులైనా జాడలేని వాన
- వర్షం పడితేనే పంటలకు మేలు
- మండలంలో దాదాపు పదివేల ఎకరాల్లో పత్తిసాగు



వర్షం లేక వాడిపోతున్న పత్తి మొలకలు

రామడుగు: ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడంతో అన్నదాతలు సంతోషంగా పంటల సాగు చేశారు. మే నెలలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్నుకొని పత్తి విత్తనాలను నాటారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురిశాయనే ఆనందం రైతులు లేకుండా పోయింది. పత్తి విత్తనాలు మొలకెత్తిన తర్వాత వర్షాలు పడకపోవడంతో మొలకలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా చినుకు జాడలేకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశలో ఉన్నారు. పంటసాగుకు రూ.వేలల్లో పెట్టుబడి అయిందని, దాదాపు 80 శాతం మేర పత్తి విత్తనాలు మొలకెత్తాయని, వర్షాలు కురవకపోతే పంట నష్టపోతామని వాపోతున్నారు. మండలంలోని వెదిర, వెలిచాల, దేశరాజ్‌పల్లి, మోతె, కోరటపల్లి, గాండ్లపల్లి, రుద్రారం, రామడుగు గ్రామాల్లో ఎక్కువ శాతం నల్ల రేగడి భూములున్నాయి. మండలంలో దాదాపు పదివేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. నిత్యం మబ్బులు ఊరిస్తున్నాయి. వర్షం పడుతుందనే ఆశిస్తున్న రైతులకు నిరాశే మిగులుతుంది. దీనికి తోడు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు రూ.వేలల్లో ఖర్చు చేశాను, ఇప్పుడు వర్షం పడకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుందని వెలిచాల గ్రామానికి చెందిన రైతు నర్సింగం వాపోతున్నాడు.

పదెకరాల్లో సాగు



పదెకరాల్లో పత్తి విత్తనాలు నాటాను. అంతటా విత్తనాలు మంచిగా మొలకెత్తాయి. వారం రోజులుగా వర్షం జాడే లేదు. దీంతో పత్తి మొలకలు ఎండలకు ఎండిపోతున్నాయి. ఇకనైనా వర్షం పడకపోతే చాలా నష్టపోయే ప్రమాదం ఉంది. వాన దేవుడు కరుణిస్తేనే పంట చేతికందుతుంది.

ఏరెడ్డి మునిరెడ్డి, వెదిర, రైతు

పరిస్థితి దయనీయం



ఐదెకరాలు కౌలుకు తీసుకొని పదిహేను రోజుల క్రితం పత్తి విత్తనాలను నాటాను. మంచిగానే మొలకలు వచ్చాయి కానీ వారం రోజులుగా వర్షం పడకపోవడంతో పత్తి మొలకలు ఎండిపోతున్నాయి. ముందస్తు వర్షాలుపడటంతో సంబురంగా పత్తిపంట సాగు చేశాను. ఇప్పుడు మా పరిస్థితి దయనీయంగా ఉంది.

రాకం శ్రీనివాస్, రైతు, గణేష్‌నగర్



గంగాధర: మండలంలోని బూర్గుపల్లి ప్రధాన చౌరస్తాలోని రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. కంపు వాసన భరించలేకపోతున్నామని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూర్గుపల్లి–గోపాల్‌రావుపేట రోడ్డు నుంచి కరీంనగర్ రోడ్డువైపు మురుగునీరు ప్రవహిస్తోందని, వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సాయిలు, పంచాయతీ కార్యదర్శి, సెల్ నం : 9391112850

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రత్యేక పారిశుధ్య పనులు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని 12వ వార్డు బీసీ కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేశామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించామన్నారు. వర్షకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు మురుగుకాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు భూపాల్‌రెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, రవీందర్, రాజయ్య, వినయ్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం కాకతీయ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే డిపో మేనేజర్‌ను సంప్రదించగా సమస్యకు పరిష్కారం లభించింది. ఈసందర్భంగా కమిషనర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్ రెడ్డి, రమణారెడ్డి, శ్యామ్, నవీన్, అమరేందర్, రఘు చారి, ప్రశాంత్, తిరుపతి రావు, శ్రీనివాస్, విప్లవ్ తదితరులున్నారు.

ఏఎస్సైగా పదోన్నతి



బ్యాడ్జ్ అందుకుంటున్న ఏఎస్ఐ తిరుపతి

చిగురుమామిడి: చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పూదరి తిరుపతిగౌడ్‌కి ఏఎస్సైగా పదోన్నతి లభించింది. బుధవారం కరీంనగర్ సీపీ చేతుల మీదుగా తిరుపతి బ్యాడ్జి అందుకున్నారు. తిరుపతిగౌడ్ 1989లో ఉద్యోగంలో చేరారు. వీణవంక, గోదావరిఖని టూటౌన్, కరీంనగర్ సీసీఎస్ విభాగంలో విధులు నిర్వర్తించారు. అలాగే బెజ్జంకి, కరీంనగర్ టూటౌన్‌లో పనిచేయగా 2014వ సంవత్సరంలో హెడ్‌కానిస్టేబల్‌గా పదోన్నతి పొందారు. 35 ఏళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి లభించగా తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తిరుపతిగౌడ్‌ను చిగురుమామిడి ఎస్సై ఎస్ శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు.

అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం చిన్నారులకు ఎంఈవో లక్ష్మీనారాయణ అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యాబోధనతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన న్యాయవాదులు



పూలమొక్క అందిస్తున్న న్యాయవాదులు

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలో హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్‌ను బుధవారం హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం సభ్యులు కలిశారు. హుజూ రాబాద్‌లో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు, ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ ఎర్రోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, ప్రధాన సలహాదారుడు వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కేశవపట్నం ఎస్సైగా శేఖర్‌రెడ్డి



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఎస్సైగా శేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సై రవిని పోలీస్ కమిషనరేట్‌కు సీపీ గౌస్ ఆలం బదిలీ చేసినట్లు సమాచారం. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న శేఖర్‌రెడ్డిని కేశవపట్నంకు బదిలీ చేశారు. అనంతరం హుజురాబాద్ ఏసీపీ మాధవిని ఎస్సై మర్యాద పూర్వకంగా కలిశారు.

అభినందనల వెల్లువ



విద్యార్థిని అభినందిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: పట్టణానికి చెందిన విద్యార్థిని నిర్విరెడ్డి ఇటీవల జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాచీన కళల్లోని కూచిపూడిలో నిర్విరెడ్డి రాణించడం హర్షనీయమని, జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు తదితరులు పాల్గొన్నారు.

పీఎం మోదీ పాలనలో అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరాచారి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. కరోనా సమయంలో ఉచిత వ్యాక్సిన్ అందజేసి ప్రజల ప్రాణాలను కాపాడారని, ఉచితంగా బియ్యం పంపిణీ చేశారన్నారు. త్రిబుల్ తలాక్ తో మైనార్టీల జీవితాల్లో ఆనందం నింపారని పేర్కొన్నారు. నాయకులు రాజిరెడ్డి, లక్ష్మణాచారి, తిరుపతి, రాజు, రాజ్‌గోపాల్‌రెడ్డి, కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి లో తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 341 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో రమేష సర్వేయర్ మనోజ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ కనకయ్య అన్నారు. చెల్పూర్ జీపీ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెండు రోజులు నిర్వహించిన సదస్సులో చెల్పూర్, రాజపల్లి, తోకలపల్లి, కుర్మపల్లి గ్రామాల రైతుల నుంచి మొత్తం 692 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలు ఉన్న 77 మంది రైతులు దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో డీటీ పార్థసారది, ఆర్ఐలు బాలకిషన్, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో రాములు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈవో కె.రాములు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తోందని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎం కే. గోపి, ఉపాధ్యాయులు వరలక్ష్మీ, సంపత్, వీరస్వామి, సతీష్ పాల్గొన్నారు.

ఈజీఎస్‌పై సమీక్ష సమావేశం



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్

శంకరపట్నం: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకంతోపాటు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని డీఆర్‌డీవో శ్రీధర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలకు పని కల్పించడంతో పాటు కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో శారద, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే పదవి అడ్డుపెట్టుకొని అరాచకాలు'

జమ్మికుంట: ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి పదవి అడ్డుపెట్టుకొని అరాచకాలు, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోతే కుటుంబంతో చస్తాననే సెంటిమెంట్‌తో ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. గ్రానైట్ వ్యాపారి కుటుంబ సభ్యులు కేసు పెట్టడంతో కోర్టులో కేసు కొట్టివేయాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాడని, కోర్టు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన బుద్ధిరావడం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లో దయ్యాలు ఉన్నాయన్న ఎమ్మెల్సీ కవిత మాట ప్రకారం మొదటి దయ్యం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అని అన్నారు. దళిత బంధును ఓట్ల కోసం వాడుకున్నారని, పథకంపై ప్రభుత్వంతో మాట్లాడమని, నిధుల విడుదలకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, సుంకరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు శేషం వరప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొద్దుల రవీందర్, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లిఇందిరానగర్ గ్రామంలో బుధవారం రాత్రి బీరన్న కామరావతి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.

స్పోర్ట్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు



పరుగు పందెం పోటీలో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం బుధవారం పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో భూపతి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో మూడు క్రీడా పాఠశాలలున్నాయని, ప్రవేశం పొందడం వల్ల మంచి క్రీడాకారులు తయారవుతారన్నారు. ప్రతి మండలంలో ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, చివరగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి ప్రవేశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి పీడీ చిరుత, శ్రీనివాస్, పీఈటీలు, రిటైర్డ్ పీడీ రాజిరెడ్డి, పి. ప్రవీణ్ కుమార్, కె. రేణుక, డి. సత్యానందం, టి. భాగ్యలక్ష్మి, సొల్లు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు- అనర్థాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వంశీకృష్ణ

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామం నరేంద్ర విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్సై వంశీకృష్ణ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు దురలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ అనర్థాలు, సైబర్ నేరాల నియంత్రణపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్సై వివరించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుల్ శివాజీ బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్ కోసం ఇష్టపడి చదువుతూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం సీహెచ్.వేణు, ఉపాధ్యాయులు కె.సత్యం, ఎం. సమ్మిరెడ్డి, కే.శంకర్, సీహెచ్. రామకృష్ణ, జి.అన్నపూర్ణ, ఏ.సురేష్, ఎ.రాధిక రాణి, రమేశ్వర్ పాల్గొన్నారు.

బుక్‌లెట్ ఆవిష్కరణ



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని పాత మార్కెట్ ఆవరణలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం జక్కుల రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్మిక చట్టల సవరణ ఆపివేయాలని, కేంద్ర తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ... జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని సమావేశంలో తీర్మానించామన్నారు. మండల నాయకుల రాజయ్య, సమ్మయ్య, శోభన్,రాజకుమారి, కుమార్, క్రాంతి, ఖలీల్ పాషా, సదానందం పాల్గొన్నారు.

27న ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

విద్యానగర్(కరీంనగర్): ఆషాఢమాసం సందర్భంగా 27న ఆర్టీసీ కరీంనగర్–2 డిపో ఆధ్వర్యంలో జూరా సంగం, రేజింత్, బీదర్‌లోని దేవాలయ సందర్శనకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ బస్సు సర్వీస్ 27న ఉదయం కరీంనగర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి తిరిగి కరీంనగర్ చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు రూ.1370 చెల్లించి తమ సీటు రిజర్వ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

20న ఒలింపిక్ డే రన్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో 39వ ఒలింపిక్ డే పురస్కరించుకుని 20న ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మహిపాల్, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, జిల్లా క్రీడలు, యువజనశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్‌నగర్, కలెక్టరేట్ మీదుగా తెలంగాణ చౌక్‌కు అక్కడి నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు రన్ కొనసాగనుందని, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రుద్రాక్షల ప్రదర్శన, అమ్మకం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని కృషిభవన్‌లో నేపాలీ రుద్రాక్ష, కరంగళి మాలల ప్రదర్శన, అమ్మకాలు 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. ప్రదర్శనలో ఏక ముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలు, పుట్టిన తేదీ, జన్మ రాశి, జన్మనక్షత్రం అనుసరించి రుద్రాక్షలు, కరంగళి మాలలు, స్పటిక సాలగ్రాలు, దక్షిణావృత శంకులు, పంచముఖి వెండితో అల్లిన మాలలు, చిన్న రుద్రాక్షలు లభిస్తాయని తెలిపారు.